RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | సంపుటి : 3, సంచిక : 262 | గురువారం సెప్టెంబర్ 18, 2025 | పేజీలు : 4 | వెల : రూ.3-00



ఫార్మసీలో కేయూ ప్రాతినిధ్యం చాలా గొప్పది

2లో..

# కలిసి రండి

## - అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి
## - ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్ష మేరకు ఆవిష్కృతమైన తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు అభివృద్ధి సాధించుకోకపోతే భవిష్యత్ తరాలకు తీరని నష్టం చేసిన వారిగా మిగిలిపోతామని అన్నారు. "తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములమవుదాం. అందుకు అందరం ప్రతిజ్ఞ తీసుకుందాం. ఈ తెలంగాణను ప్రపంచంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దుకుందాం. ఎజెండాలు, జెండాలు పక్కన పెట్టి ప్రభుత్వం ప్రణాళికా బద్ధం చేస్తున్న అభివృద్ధిలో కలిసిరండి. ఈ ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది." అని పేర్కొన్నారు.

"ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం అండగా ఉన్నంత కాలం ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిస్తాం. ఈ రోజు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతానని, అందుకు మీ అందరి సహకారం, ఆశీర్వాదం ఉండాలి" అని ప్రజాపాలన దినోత్సవ వేదిక నుంచి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

నిజాం నియంతృత్వ పాలనపై సాయుధ పోరాటంతో సామాన్యుడు సాధించుకున్న విజయానికి గుర్తుగా సెప్టెంబర్ 17 న నిర్వహిస్తున్న ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 'నిజాం నిరంకుశ పాలనపై జరిగిన పోరాటంలో 1948, సెప్టెంబర్ 17 రోజున ప్రజలు విజయం సాధించి, స్వేచ్ఛా పతాకను ఎగుర వేసిన రోజు. అందుకే ఇది ప్రజా పాలన దినోత్సవం. రాష్ట్ర ప్రజలందరికీ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు.



అణచివేత, పెత్తందారీతనం, మిగతా 3వ పేజీలో..

## బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం



**వేద న్యూస్,బోయినిపల్లి:**

తెలంగాణ ప్రజల పోరాటాలు, ఎందరో వీరుల బలిదానాలతో నిజాం నిరంకుశ కబంధహస్తాల నుండి తెలంగాణ విమోచన పొంది స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు పొందిన రోజు సెప్టెంబర్ 17 అని భారతీయ జనతా పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో అమరవీరులను స్మరించుకుంటూ భారతీయ జనతా పార్టీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్, నాయకత్వంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బోయినిపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బూత్ అధ్యక్షులు జాతీయ జెండాను ఆవిష్కరించగా, మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్, జాతీయ జెండాను ఆవిష్కరించి మండల ప్రజలందరికీ తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోడి,పుట్టినరోజు సందర్భంగా బోయినిపల్లి మండల కేంద్రంలో బిజెపి నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి వారి జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నర్సింహచారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, మండల నాయకులు,సీనియర్ నాయకులు , బూత్ అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఎవరు పార్టీలు పెట్టినా స్వాగతిస్తాం

### - తీన్మార్ మల్లన్న కొత్త పార్టీపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ స్పందన
### - పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించడం వల్లే తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేశామన్న మహేశ్ గౌడ్

**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణ విలీనంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమీ లేదంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో స్పందించారు. కవితకు చరిత్రపై అవగాహన లేదంటూ ఆయన విమర్శించారు. "అసలు కవిత ఎప్పుడు పుట్టారు? ఆమెకు చరిత్ర తెలుసా?" అంటూ సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ విలీన దినోత్సవానికి, కవితకు ఏం సంబంధమని ఆయన నిలదీశారు. చారిత్రక వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అంశంపై కూడా మహేశ్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించినందువల్లే తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సి వచ్చిందని ఆయన వివరించారు. అయినప్పటికీ, బీసీల హక్కుల కోసం పోరాడే నాయకుడిగా మల్లన్నను తాను గౌరవిస్తానని అన్నారు. రాజకీయాల్లో ఎవరు పార్టీలు పెట్టినా స్వాగతిస్తామని, మల్లన్న కొత్త పార్టీ నిర్ణయాన్ని కూడా ఆహ్వానిస్తున్నామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఇదే సందర్భంగా పార్టీ అంతర్గత వ్యవహారాలపైనా ఆయన స్పందించారు. కోమటిరెడ్డి సోదరులు తమ అభిప్రాయాలను బాహాటంగానే వెల్లడిస్తారని, కాంగ్రెస్ పార్టీలో ఆ మేరకు స్వేచ్ఛ ఉందని తెలిపారు. అయితే, ఆ స్వేచ్ఛను అలుసుగా తీసుకుని ఎవరైనా 'రెడ్ లైన్' దాటితే మాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. పార్టీ క్రమశిక్షణను అతిక్రమించే చర్యలను సహించబోమని తేల్చిచెప్పారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

## - త్యాగమూర్తుల త్యాగఫలమే..ప్రజా పాలన దినోత్సవం - రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

అనేకమంది త్యాగమూర్తుల త్యాగఫలమే నేడు మనం సంతోషంగా జరుపుకుంటున్న ప్రజాపాలన దినోత్సవం అని రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని అజంజాహి గ్రౌండ్ లో కొత్త కలెక్టరేట్ ఐడిఓసి పక్కన నిర్వహించిన "తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ" వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరులకు నివాళులర్పించి, అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తర్వాత జాతీయ గీతం మరియు తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజు అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతం భారతీయ యూనియన్‌లో చేరి ప్రజా పాలన ప్రారంభమై 77 సంవత్సరాలు పూర్తై 78వ సంవత్సరం అడుగుపెడుతున్న సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు మరియు జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.రాచరిక వ్యతిరేక పోరాటంలో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, బండి యాదగిరి వంటి నాయకుల స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం బలపడిందని గుర్తుచేశారు.అనేకమంది త్యాగమూర్తుల త్యాగఫలమే నేడు మనం సంతోషంగా జరుపుకుంటున్న ప్రజా పాలన దినోత్సవం అని రాష్ట్ర పర్యావరణ అటవీ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసిందని, జిల్లాలో 8871 ఇందిరమ్మ ఇండ్లను మొదటి విడత మంజూరు చేశామని ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం ద్వారా 14 కోట్ల రూపాయలకు రైతులకు ఖాతాలో జమ చేశామని రైతు నేస్తం కార్యక్రమాలలో రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సహకారంతో సలహాలు అందిస్తూ వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మామునూరు ఎయిర్పోర్ట్ వరంగల్ టెక్స్టైల్ పార్క్ తో పాటు వరంగల్ రెండో రాజధాని అభివృద్ధి కోసం 4962 కోట్ల రూపాయలు కేటాయించామని, ఆడపిల్లల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించి భేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని బలోపేతం చేస్తున్నామని జిల్లాలో సాగునీరు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ రబీ సీజన్లో రైతులకు కాలువల ద్వారా నీళ్లు అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని, పథకాలు వేగంగా అమలు చేస్తున్నామని తెలిపారు.



# మౌలిక వసతులు కల్పించాలి

## - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ లో ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కందికట్కూర్ గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నీరు నిలిచి ఉండడాన్ని కలెక్టర్ గమనించారు. ఈ కాలనీలో సీ సీ రోడ్డు, మురుగు కాలువలు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో కావలసిన అన్ని వసతులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో ఎంపీడీఓ శశికళ, శ్రీనివాస్, నాయబ్ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



వేద న్యూస్

గురువారం సెప్టెంబర్ 18, 2025

# కేయూ ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్ బోర్డు, వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రోజున ఆర్చరీ క్రీడాకారులు పురుషులు, మహిళల జట్ల ఎంపికలు జరిగాయి. ఇందులో వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుండి ఆర్చరీ క్రీడాకారులు తన్వీర్ కౌసర్, త్రిశూల్ , రమ్యశ్రీ, మనసుర హసీభ, వెంకటేష్, ఆనంద్, అశ్విత్ దొర, గంగ రాజు, సునీల్ పాల్గొన్నారు. ఈ జట్లు అక్టోబర్లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్షిప్ లో హెచ్ఎన్ యూనివర్సిటీ, పాట్నా, గురు కాశి యూనివర్సిటీ, పంజాబ్ లో పాల్గొంటారు. ఈ సెలెక్షన్స్ లో సెక్రటరీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ఆచార్య వై. వెంకయ్య, సెలెక్టర్ లు డాక్టర్ ఎ.టి.బి.టి. ప్రసాద్, డాక్టర్ కుమారస్వామి, రాజేష్, ఆంజనేయులు, పర్వీన్ తదితరులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్ కు నో చెప్పండి, మాదక ద్రవ్యాలకు నో చెప్పండి



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కేయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెమినార్ హాల్లో యాంటీ-ర్యాగింగ్, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేయూ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీ పి. శ్రీకాంత్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ర్యాగింగ్, మాదకద్రవ్యాల దుర్వినియోగం యొక్క పరిణామాలను వివరిస్తూ సైబర్ నేరాలపై విద్యార్థులను హెచ్చరించారు. సమాజానికి అవగాహన కల్పించాలని వారిని కోరారు, అదేవిధంగా 112 (జాతీయ అత్యవసర పరిస్థితి) 1930 (సైబర్ క్రైమ్) హెల్ప్లైన్ నంబర్లకు డైల్ కాల్ పై వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ, సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ కు జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎన్. సత్యశివ ప్రసాద్, శ్రీ ఆర్. దయాకర్, డాక్టర్ కె. శ్రీధర్, ఆర్. డి. ప్రసాద్, అమరేందర్, డి. ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన చెర్లపల్లి(ఎన్) గ్రామస్తులు

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర మండలానికి చెందిన చెర్లపల్లి(ఎన్) గ్రామస్తులు మధుర నగర్లోని ప్రజా కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో 40 ఇండ్లు, అనేక వ్యవసాయ భూములు నారాయణపూర్ రిజర్వాయర్ నిర్మాణం కారణంగా ముంపునకు గురవుతున్నాయని వారు వివరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తరఫున తగిన పరిహారం అందజేయాలని, జీవనోపాధి కోల్పోతున్న కుటుంబాలను ఆదుకోవాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, “ముంపు బాధితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిహారం అందేలా కృషి చేస్తాం” అని భరోసా కల్పించారు.

# ఎంపీపీ ఆఫీసులో జెండా ఆవిష్కరణ

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రం లో బుధవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకొని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి జయశీల జాతీయ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతి నిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీలో కేయూ ప్రాతినిధ్యం చాలా గొప్పది

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ యూనివర్సిటీ ఉనికిని చాటడంలో పూర్వ విద్యార్థులు మా కేయూబలం అని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి తెలియజేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం గోల్డెన్ జూబ్లీ సంబరాలు జరుపుకుంటున్న నేపథ్యంలో, వైస్ ఛాన్సలర్ అమెరికా పర్యటనలో భాగంగా, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని న్యూ జెర్సీలోని అట్లాంటాలో ఒక ప్రైవేటు హొటల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాల విశ్వవిద్యాలయ ఫార్మసీ చాప్టర్, పూర్వ విద్యార్థి డాక్టర్ సాంబా రెడ్డి అధ్యక్షతన, మూడు రోజుల సంబరాల సందర్భంగా “సెలబ్రేట్ అండ్ కంట్రీబ్యుట్” అనే థీంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొని పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత అధ్యాపకులను ఉద్దేశించి విస్తృత ఉపన్యాసం చేస్తూ ప్రసంగించారు. ఐదు దశాబ్దాల సుదీర్ఘమైన అకాడమిక్ ప్రయాణంలో మూడు వేలమందికి పైగా బి.ఫార్మసీ, 18వందల మంది ఎం. ఫార్మసీ, 370మంది పిహెచ్ డీ పట్టాలు పొంది శాస్త్రవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా, నియంత్రణ సంస్థల అధికారులుగా, ఫార్మసీ బోధకులుగా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించారని, వీరిలో డాక్టర్ మన్సూర్ ఖాన్, అమెరికా సంయుక్త రాష్ట్రాల ఎఫ్.డి.ఎ పూర్వపు సంచాలకులుగా, డాక్టర్ మురళీకృష్ణ డి.వి, దివిస్ ల్యాబ్ వ్యవస్థాపకులుగా, టెక్సాస్, ఎ అండ్ ఎం యూనివర్సిటీలో డాక్టర్ సాంబా రెడ్డి ఉన్నారని తెలిపారు. వీరి పరిశోధనలో ఎన్నో విప్లవాత్మక మెడిసిన్,లు ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ద్వార వచ్చాయన్నారు. ఫార్మసీ విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య వై.మధుసూదన్ రావు మృతికి నివాళులర్పించారు, ఆచార్య సి.కే.కొకాటే, ఆచార్య మల్లారెడ్డి, ఆచార్య అమరేశ్వర్, ఆచార్య రామ్ బహు, ఆచార్య డి.రామకృష్ణ, ఆచార్య ఎం.సి.ప్రభాకర్ లు చేసిన సేవలను కొనియాడారు. విశ్వవిద్యాలయ ఫార్మసీ విద్యను ప్రపంచవ్యాప్తం చేయటంలో వారి కృషిని అబినందించారు. పూర్వ విద్యార్థుల సమూహాలు, యూనివర్సిటీ గ్లోబల్ భాగస్వామ్యానికి రావాలన్నారు, భవిష్యత్ లో “అలుమ్ని సెంటర్ అఫ్ ఎక్సలెన్స్” పేరిట వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని, ముఖ్యంగా ప్రపంచ వ్యాప్త ఫార్మసీ అకాడెమి, ఇండస్ట్రీ కొలాబరేషన్ జరగాలి, విద్యార్థి, ఫాకల్టీ మార్పిడికి అవగాహనా ఒప్పందాలు జరగాలి, ఫార్మ రంగంలో వస్తున్న నూతన పోకడలకు అనుగుణంగా శిక్షణ, పారిశ్రామిక యాత్రలు జరగాలని పూర్తీ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో “అలుమ్ని గోల్డెన్ జూబ్లీ రీసెర్చ్ సెంటర్ అఫ్ ఎక్సలెన్స్” ను ఏర్పాటు చేసి పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో భారత్, అమెరికా సంయుక్త రీసెర్చ్ గ్రాంట్ ఏర్పాటు జరగాలని, ఆన్లైన్ ద్వార టీచింగ్, ప్రపంచ వ్యాప్త రీసెర్చ్ అవగాహనా పెరగాలన్నారు. డిసెంబర్ చివరిలో వరంగల్లో జరుగు ఫార్మసీ గోల్డెన్ జూబ్లీ ముగింపుకు అందరి సహకారంతో పాటు ఆ కార్యక్రమంలో అందరూ పాల్గొని భవిష్యత్ ప్రణాళికకు సిద్ధం కావాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, అమెరికా సంయుక్త రాష్ట్రాల విశ్వవిద్యాలయ ఫార్మసీ చాప్టర్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పరుచూరితో పాటు పలువురు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే- హెచ్ 143 నూతన కార్యవర్గం ఎన్నిక

## - ఇల్లంతకుంట మండల అధ్యక్షుడిగా పైడి రాజు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో బుధవారం టియుడబ్ల్యూజే -హెచ్ 143 మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పైడి రాజు, ఉపాధ్యక్షులు చేరాల రాజు, ప్రధాన కార్యదర్శిగా జంగిటి శ్రీనివాస్, కోశాధికారి కోలపురం మహేష్,ప్రచార కార్యదర్శి నాయిని తిరుపతి, సహాయ కార్యదర్శి బొల్లం సాయి రెడ్డి, ముఖ్య సలహాదారులుగా దొడ్ల దేవేందర్, బట్టు శ్రీనివాస్, మామిడి కమలాకర్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో జర్నలిస్టుల సమస్యలపరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు బొల్లం పర్శరాములు,జిల్లా కమిటీ సభ్యులు గుర్రాల మెహన్, జిల్లా సహాయ కార్యదర్శి మరియు ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి మహమ్మద్ సలీమ్, కార్యవర్గ సభ్యులు, ఆంజనేయులు, అనిల్, నారాయణ, చందు, శంకర్, పర్శరాములు, ప్రశాంత్,అనిల్ పాల్గొన్నారు.

# సాయుధ పోరాట స్ఫూర్తితోనే ప్రజాపాలన

## - కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి

**వేద న్యూస్, శాయంపేట:**



నాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి తోనే నేడు ప్రజాపాలన సాధించుకున్నామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం ప్రజాపాలన దినోత్సవ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుచ్చిరెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘనత తెలంగాణ సాయుధ పోరాటానిదని అభిప్రాయపడ్డారు. సాయుధ పోరాటంతో సాధించుకున్న విజయం ఈరోజు మనం అనుభవిస్తున్న ప్రజాస్వామ్యం అని తెలిపారు. మండల ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారపల్లి రవీందర్, వైనా కుమారస్వామి , చిందం రవి, చింతల రవి పాల్, ఐ ఎన్ టి యు సి మండల అధ్యక్షుడు మారపెల్లి రాజేందర్, వరదరాజు, కట్టయ్య, సాదు నాగరాజు, రఫీ, మార్కండేయ, చిరంజీవి, మార్కండేయ, వీరన్న, వడ్డేపల్లి శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు

**వేద న్యూస్, చొప్పదండి :**



మండల పరిధిలోని ఆర్నకొండ గ్రామం నుండి మల్యాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి 50 కోట్లు మంజూరు కావడం హర్షనీయమని పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు మచ్చ రమేష్ అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సి ఆర్ ఏ ఎఫ్ కింద 50 కోట్లు మంజూరు చేసిందని ఈ దీనిలో 40 శాతం చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం రాష్ట్ర వాటాగా కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరడంతో రాష్ట్ర వాటా 40 శాతం కేటాయించారని వారు పేర్కొన్నారు. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో ముందున్నారని అన్నారు. గతంలో వాహనదారులు ప్రజలు ఈ సింగిల్ రోడ్డుపై అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని డబుల్ రోడ్డు నిర్మాణంతో ప్రజలు వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణాలను కొనసాగిస్తారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ లకు మచ్చ రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# కలిసి రండి

నియంతృత్వం, బానిసత్వం సంకెళ్లను బద్దలు కొట్టి స్వేచ్ఛకు ఊపిరి పోయడానికి ఊపిరి వదిలిన వందలాది మంది అమరులకు ఈ సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను." అని వెల్లడించారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి. అదే విధంగా డిసెంబర్ 7, 2023 స్వరాష్ట్ర ప్రజాస్వామ్య ప్రస్థానంలో మరో మైలు రాయి. 77 ఏళ్ల తెలంగాణ ప్రస్థానాన్ని, పోరాట చరిత్రను, ఇక్కడ ఉద్భవించిన ఉద్యమాల సరళిని సంపూర్ణంగా ఆకళింపు చేసుకుని, ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని మేం ఈ రోజు పరిపాలన చేస్తున్నాం." అని చెప్పారు అహంకారపు ఆలోచనలు, బంధు ప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి మా పాలనలో తావు లేదు. కష్టమైనా, నష్టమైనా ప్రజలతో పంచుకుంటున్నాం. ప్రజల ఆకా ంక్షలు, వారి ఆలోచననే ప్రమాణికంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. తీసుకున్న నిర్ణయాలలో మంచి చెడులను విశ్లేషించే అవకాశం ఇస్తున్నాం. తప్పులుంటే దిద్దుకుంటున్నాం. మంచి చేయడమే బాధ్యతగా భావిస్తున్నాం. అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడాలన్న తపనతో పని చేస్తున్నాం." అని వెల్లడించారు. విద్యనే మన విజయానికి వజ్రాయుధం అని మేం నమ్ముతున్నాం. గొప్ప విజన్‌తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల ఆలోచన చేశాం. భవిష్యత్‌లో తెలంగాణ విద్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ఈ స్కూళ్లు కేంద్రాలుగా మారబోతున్నాయి. విద్యపై మేం చేస్తున్న వ్యయం ఖర్చు కాదు. భవిష్యత్ తెలంగాణకు పెట్టుబడిగా మేం భావిస్తున్నాం. రాష్ట్ర విద్యా పాలసీని త్వరలో తీసుకురాబోతున్నాం." అని వెల్లడించారు. మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి" నినాదంతో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మేం చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. మహిళలు నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్, మహిళా మార్ట్ లు అందుకు నిదర్శనం." అని చెప్పారు. హరిత విప్లవం నుండి ఉచిత విద్యుత్ వరకు, రుణమాఫీ నుండి రైతు భరోసా వరకు రైతుల కోసం మనం రూపొందించిన సంక్షేమ పథకాలు ఎప్పటికప్పుడు కొత్త చరిత్రను సృష్టిస్తున్నాయి. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణాలు మాఫీ చేసి దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రైతులను ఆదుకున్నాం." అని వివరించారు.

" ఏ గ్రామమైనా, జిల్లా అయినా, రాష్ట్రం, దేశం ముందుకు వెళ్లాలంటే ప్రణాళికలు అవసరం. 2047 నాటికి భారతదేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్న సంకల్పం మాది. ఆ సంకల్పానికి దార్శనిక పత్రమే 'తెలంగాణ రైజింగ్ 2047'. డిసెంబర్ 9 న రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తాం." అని స్పష్టం చేశారు.

"ఈ సంకల్ప పత్రాన్ని కార్యచరణలో పెట్టి 2047 నాటికి దేశ ప్రగతిలో తెలంగాణది కీలక పాత్రగా చేయడమే మా సంకల్పం. మా సంకల్పానికి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీస్సులు కావాలి. సాయుధ పోరాట స్ఫూర్తితో మొదలైన మన ప్రయాణం... ప్రపంచ వేదికపై తెలంగాణ జెండా ఎగిరే స్థాయికి చేరాలి. ఆ బాధ్యత మాది. అందుకు ప్రజల సంపూర్ణ సహకారం కావాలి.." అని అన్నారు. ఈ ప్రజా పాలన దినోత్సవ వేడుకలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గారు, డీజీపీ జితేందర్ గారితో పాటు ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా విశ్వకర్మ జయంతి

## – విశ్వబ్రాహ్మణ సంఘం ఆద్వర్యంలో..

**వేద న్యూస్, చొప్పదండి:**



దైవిక వాస్తు శిల్పి సకల చరాచర సృష్టికి ములకారకుడు విశ్వకర్మ జయంతి పురస్కరించుకొని చొప్పదండి పట్టణంలో ని శ్రీ మాతా గోవిందమాబ సమేత వీర బ్రహ్మేంద్ర స్వామి శ్రీ రమ సత్యనారాయణ స్వామి శ్రీ భక్తాంజనేయ స్వామి అలయ ప్రాంగణంలో కమిటీ వారి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ భగవానుని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భగవానుని కి ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడు సృష్టి కర్తఐనా పరమేశ్వరుని అవతారంగా అవతరించి సృష్టి తయారు చేశాడు అని అన్నారు. ఆ విశ్వకర్మ నుండే విశ్వ బ్రాహ్మణులు వచ్చారు. విశ్వ బ్రాహ్మణులు లేనిదే విశ్వం లేదు అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో విశ్వ బ్రాహ్మణ కుల బంధువులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

ప్రజాస్వామ్యాన్ని పటిష్టంగా నిలిపే బాధ్యత మనందరిదని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం తెలిపారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవన ప్రాంగణంలో తెలంగాణా ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం జాతీయ జెండా ఎగురవేసి ఉద్యోగులు, విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ తెలంగాణా ప్రజలు రాజకీయ, సాంస్కృతిక చైతన్యానికి నాంది పలికిన రోజని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలకమండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, కే.అనితారెడ్డి, ప్రిన్సిపాల్ లు ఆచార్య టి. మనోహర్, ఆచార్య ఎస్. నరసింహ చారి తో పాటు ఆచార్య పి.మల్లారెడ్డి, ఆచార్య ఈసం నారాయణ, ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి, ఆచార్య ఎం.ఇస్తారి, డాక్టర్ ఎల్.పి.రాజ్ కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎల్.రాము, సహాయ రిజిస్ట్రార్ సిహెచ్. ప్రణయ్ కుమార్, కేయూ పిఆర్ఓ డాక్టర్ వి.పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులపై కేసుల ఎత్తివేత

## - సీజ్ చేసిన పవర్ లూమ్స్ ను తిరిగి పునరుద్ధరించిన అధికారులు - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు కార్మికుల కృతజ్ఞతలు

**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం గర్షకుర్తిలో గత నాలుగు రోజుల క్రితం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పవర్ లూమ్స్ పై దాడులు చేశారు. పవర్ లూమ్స్ ను సీజ్ చేసి, కలర్ బట్టలు నేస్తున్నారని నె పంతో చేనేత కార్మికుల పైన కేసులు నమోదు చేశారు. బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గర్శకుర్తి గ్రామానికి వెళ్లి చేనేత కార్మికులతో మాట్లాడారు. అధికారులు అక్రమంగా తమపై కేసులు నమోదు చేశారని, కార్మికులు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ కు ఫోనులో మాట్లాడారు. చేనేత కార్మికులపై అధికారులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని, సీజ్ చేసిన పవర్ లోన్స్ తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో చేనేత కార్మికుల పై పెట్టిన కేసులను విజిలెన్స్ అధికారులు ఎత్తివేశారు. అంతేకాకుండా సీజ్ చేసిన పవర్ లూమ్స్ ను తిరిగి పునరుద్ధరించారు. గంటల వ్యవధిలోని తమపై పెట్టిన కేసులను ఎత్తివేయించడంతోపాటు, పవర్ లూమ్స్ తిరిగి పునరుద్ధరింపజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు గర్శకుర్తి గ్రామ చేనేత కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.




# నిధులివ్వాలని ఎంపీడీవోకు వినతి

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం 23 ,గ్రామ పంచాయతీల పరిశుభ్రత, వీధిలైట్ల వ్యవస్థ, అలాగే చెరువుగట్ల ప్రాంతంలో బతుకమ్మలు వేసే ప్రాంతంలో పరిశుభ్రత, రోడ్ల పరిశుభ్రత, కొరకై గ్రామపంచాయతీలో నిధులు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, ప్రభుత్వంతో మాట్లాడి గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు చేసి బతుకమ్మ పండుగ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పండుగ వాతావరణం నెలకొల్పే విధంగా మీ ద్వారా గ్రామపంచాయతీ కార్యదర్శిలకు, గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. గ్రామాలను సందర్శించి, పర్యవేక్షించాలని కోరుతూ సిపిఐ ఎం పార్టీ మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ బుధవారం ఎంపీడీవో,కి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్,జిల్లా రైతు సంఘం అధ్యక్షులురమంచా అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయా జెండా ఆవిష్కరణ



## – చొప్పదండి పోలీస్ స్టేషన్ లో..

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పోలీస్ స్టేషన్లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ను పురస్కరించుకోని జాతియా జెండాను చొప్పదండి సిఐ ప్రదీప్ కుమార్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సమ్మయ్య, హెడ్ కానిస్టేబుళ్ళు వేణు, ముస్తఫా అలీ, బలరాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి అండగా ఎమ్మెల్యే మేడిపల్లి

## – బాధిత కుటుంబానికి రూ. 50వేల చెక్కును అందజేత

**వేద న్యూస్, చొప్పదండి/ గంగాధర:**



గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన కొట్టపల్లి స్రవంతి అనే మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మరణించింది. స్రవంతికి ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా స్రవంతి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ ప్రమీల సత్పతితో మాట్లాడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. దీంతో ప్రభుత్వం తరఫున రూ. 50 వేలు మంజూరు కాగా, గంగాధర మండలం గర్షకుర్తిలో స్రవంతి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెక్కును అందజేశారు. ఆపదలో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# జాతీయపతాకవిష్కరణ



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి ఏఎంసీ చైర్మన్ సుకినె సంతాజీ బుధవారం ఎల్కతుర్తి మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి తోనే నేడు ప్రజాపాలన సాధించుకున్నామని చెప్పారు. ప్రపంచ ఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘనత తెలంగాణ సాయుధ పోరాటానిదని అభిప్రాయపడ్డారు. సాయుధ పోరాటంతో సాధించుకున్న విజయం ఈరోజు మనం అనుభవిస్తున్న ప్రజాస్వామ్యం అని తెలిపారు. మండల ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్



# రాష్ట్రంలో నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు



- తెలంగాణలో పూర్తిగా నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ సేవలు
- రూ.1400 కోట్లకు పైగా బకాయిలే కారణమంటున్న ఆసుపత్రులు
- సేవలు కొనసాగించాలని ప్రైవేటు యాజమాన్యాలకు దామోదర విజ్ఞప్తి
- తాము నెలకు రూ.100 కోట్లు ఇస్తున్నామని మంత్రి వెల్లడి
- ప్రజలు ఆందోళన చెందవద్దని భరోసా

**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలకు అనూహ్యంగా బ్రేకులు పడ్డాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు సేవలను పూర్తిగా నిలిపివేశాయి. ఈ హఠాత్పరిణామంతో రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్యతరగతి రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. తమకు ప్రభుత్వం నుంచి రూ.1,400 కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉందని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఆరోపిస్తోంది. ఈ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. బకాయిలు చెల్లించేంత వరకు సేవలను పునరుద్ధరించేది లేదని ఆసుపత్రుల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిణామంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఆరోగ్యశ్రీ సేవలను యథావిధిగా కొనసాగించాలని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలను ఆయన కోరారు. తాము కల్పించిన స్వేచ్ఛను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "గత తొమ్మిదిన్నర ఏళ్లుగా సేవలు కొనసాగించిన ఆసుపత్రులు, ఇప్పుడే ఎందుకు నిలిపివేశాయో చెప్పాలి. గత ప్రభుత్వ హయాంలో నెలకు రూ.50 కోట్లు కూడా విడుదల కాని పరిస్థితి ఉండేది" అని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెలకు రూ.100 కోట్లు చెల్లించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

# హైడ్రాలో ఘనంగా ప్రజాపాలనా దినోత్సవం

## - జాతీయ జెండాను ఆవిష్కరించిన కమిషనర్

**వేద న్యూస్ డెస్క్:**




ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ దిశానిర్దేశం చేశారు. ప్రజల సాధకబాధలను అర్థం చేసుకుని సమస్యలను పరిష్కరించే విధంగా అందరూ పని చేయాలని సూచించారు. హైడ్రా కార్యాలయంలో ప్రజాపాలనా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి.. జాతీయ జెండాను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. 1948, సెప్టెంబరు 17న భారత ప్రభుత్వంలో హైదరాబాద్ రాష్ట్రం విలీనమైన సందర్భాన్ని, నాటి పోరాటాన్ని కమిషనర్ వివరించారు. ప్రజాపాలనకు హారతి పట్టిన రోజుగా సెప్టెంబరు 17ను అభివర్ణించారు. అందుకే సెప్టెంబరు 17ను ప్రజా పాలన దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రజాభిష్టం మేరకు పాలన సాగించాలని.. అప్పుడే వారి మన్ననలు, మద్దతు పొందగలమన్నారు. ఇందుకు హైడ్రాలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని.. వారి సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలని సూచించారు. ప్రజాపాలన దినోత్సవం ముఖ్య ఉద్దేశం కూడా ఇదేనని అన్నారు. అందరికీ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# రూ. 11.50 కోట్ల విలువైన భూమని కాపాడిన హైడ్రా

## -వెయ్యి గజాల పార్కు స్థలంలో ఆక్రమణల తొలగింపు

**వేద న్యూస్ డెస్క్:**




రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని మాధవా హిల్స్ ఫేజ్-2లో పార్కు స్థలాన్ని హైడ్రా మంగళవారం కాపాడింది. వెయ్యి గజాల పార్కు స్థలంలో స్థానికంగా ఉన్న వాళ్లు గోడలు కట్టి.. షెడ్డులు వేశారంటూ హైడ్రా ప్రజావాణిలో మాధవాహిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను స్థానిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి... పార్కు స్థలంగా నిర్ధారించుకున్న హైడ్రా.. వెంటనే ఆక్రమణలను తొలగించింది. ఈ భూమి విలువ దాదాపు రూ.11.50 కోట్లు ఉంటుందని అంచనా. పార్కును కాపాడినట్టు పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది.

# ఎంపీడీవో ఆఫీసులో జాతీయ పతాక ఆవిష్కరణ

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**




ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండల స్పెషల్ అఫీసర్ నారాయణ జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 17న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన వేడుకలను ఘనంగా జాతీయ జెండా ఎగురవేయ్యాలని కాంగ్రెస్ ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎంపీడీవో కార్యలయంలో నారాయణ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం నారాయణ మాట్లాడుతు 1948లో హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన సందర్భంగా సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. రాచరిక పాలన నుండి విముక్తి పొంది తెలంగాణలో ప్రజాస్వామ్య పాలన ఆరంభ మైన రోజని, నేడు సువిశాల భారతావనిలో తెలంగాణ అంతర్భాగమైన రోజును పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహమ్మద్ సలీం, మండల విద్యాధికారి మధు, ఎపివో కొమురయ్య, ఎపిఎం శంకర్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్య, మండల పరిషత్ కార్యలయ సిబ్బంది, ఈజిఎస్ సిబ్బంది, మండల వనరుల కేంద్రం సిబ్బంది, ఎస్ఈఆర్పి ఇబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరానగర్‌లో ప్రారంభం కానున్న నవరాత్రులు

**వేద న్యూస్, ఆసిఫాబాద్:**



కొమురం భీం జిల్లా రెబ్బన మండలం ఇందిరానగర్ గ్రామంలో వెలసిన శ్రీ కనక దుర్గాదేవి స్వయంభూ శ్రీ మహంకాళీ దేవస్థానంలో సెప్టెంబర్ 22వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఒక్కో రోజు అమ్మవారు ఒక్కొక్క అలంకారంలో భక్తులకు దర్శనమిస్తుంది. అమ్మవారి దర్శనానికి మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, ఆదిలాబాద్, కరీంనగర్, భూపాలపల్లి హైదరాబాద్, మరియు మహారాష్ట్ర, జిల్లాల నుండి భక్తులు వస్తారు.

**- ఈసారి నవరాత్రుల ప్రత్యేకత**

పది సంవత్సరాలకు ఒకసారీ వచ్చే నవరాత్రి ఉత్సవాలు ఈ సారి రానున్నాయి. నవరాత్రులు అంటే ప్రతి సారి 10 రోజులు ఉండగా ఈసారి మాత్రం 11 రోజులు నిర్వహిస్తారు. దీనికి గల కారణం ఒకే తిథి రెండు రోజులు రావడం వలన ఈ సారి ఒక అలంకరణ పెరిగింది. మొదటి రోజు బాల త్రిపుర సుందరి, రెండవ రోజు గాయత్రి దేవి, మూడవ రోజు అన్నపూర్ణ దేవి, నాల్గవ రోజు మహంకాళీ, ఐదవరోజు లలిత త్రిపుర సుందరి దేవి, అరవ రోజు మహాలక్ష్మి, ఏడవ రోజు మహా చండీ, ఎనిమిదవ మహా సరస్వతి, తొమ్మిదవ రోజు దుర్గా దేవి, పదవ రోజు మహిషాసుర మర్దిని, పదకొండవ రోజు శాంత స్వరూపిణి శ్రీ రాజరాజేశ్వరిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారు. ప్రతి రోజు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం హోమం నిర్వహించబడును.

**- భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి: ఆలయ కమిటీ అధ్యక్షుడు, ప్రధాన అర్చకుడు**

సెప్టెంబర్ 22వ తేదీన దేవార వినోద్ స్వామి ఆధ్వర్యంలో భక్తులకు భవానీ మాలధారణ చేసి నియమాలను, విశిష్టతను తెలియజేస్తారు. జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన దేవస్థానం కనుక గత సంవత్సరం కంటే ఈ సారి భవానీ మాల స్వీకరించే భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. విజయ దశమి రోజున వాహన పూజలు, సాయంత్రం 4 గంటలకు అమ్మవారి పలికే సేవ ఊరేగింపు ఉంటుంది. వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెమ్ తిరుపతి గౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ స్వామి తెలియజేశారు.

## ఆయన కలలను నిజం చేయడానికే

# ప్రధాని మోదీ కృషి : రాజ్‌నాథ్ సింగ్

**- పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు - హాజరైన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**







**వేద న్యూస్ డెస్క్:**

జాతీయ సమగ్రతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్‌నాథ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. సర్దార్? వల్లభాయ్ పటేల్ సమర్థత వల్లే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో కలిసిందన్న రక్షణమంత్రి పటేల్ కలలు కన్న దేశాన్ని నిర్మించేందుకు మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన సెప్టెంబర్ 17ను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినంగా నిర్వహించింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న వేడుకలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పరేడ్ మైదానంలోని అమర జవాన్ల స్మృతి స్థల్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సర్దార్ వల్లభాయ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. భద్రతా బలగాల గౌరవవందనం స్వీకరించారు. నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారన్న రాజ్‌నాథ్‌సింగ్ వారి ఆగడాలు తట్టుకోలేక ప్రజలు తిరగబడ్డారని గుర్తుచేశారు. పటేల్ సమర్థత వల్లే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో కలిసిందని తెలిపారు. ఆపరేషన్ పోలోతో సర్దార్ పటేల్ ఎంతో ముందుచూపుతో వ్యవహరించారన్న రాజ్‌నాథ్, పటేల్ కలలు కన్న దేశాన్ని నిర్మించేందుకు మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిజాం మెడలు వంచి స్వాతంత్ర్యాన్ని సిద్ధించారు : ప్రధాని మోదీ ఆదేశాలతో విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహిస్తోందన్న మరో కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్ తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వారిని కేంద్రం గుర్తించి గౌరవిస్తుందని పేర్కొన్నారు.తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిన సెప్టెంబర్ 17న ఎందుకు జాతీయ జెండా ఎగరవేయడం లేదో చెప్పాలని మరో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్?ఎస్ పేర్లు మార్చి వేడుకలు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. అమిత్ షా చొరవ వల్లే కేంద్రం తెలంగాణ విమోచన వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందన్న కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం, ఒక వర్గాన్ని సంతృప్తి పరిచేందుకు రాష్ట్ర పాలకులు అధికారికంగా వేడుకల్ని నిర్వహించడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక గల్లీ గల్లీలో జాతీయ జెండా ఎగరవేస్తామని స్పష్టం చేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073